క్లుప్తంగా

ఎంపీకి సన్మానం



రఘురాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని సన్మానించారు. శుక్రవారం సాయంత్రం కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కొండం వెంకన్నగౌడ్, యర్రంశెట్టి ముత్తయ్య, జాల జానకిరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, జోషికుమార్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీలో పీఆర్‌టీయూటీఎస్ మండల ఉపాధ్యాయుల సమావేశం శనివారం జరిగింది. యూనియన్ మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కాకర్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా జూలూరుపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్, గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ యుగంధర్, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా రాంబాబు, దేవేందర్ ఎన్నికయ్యారు.

ఆటో వర్కర్ల కమిటీ..

జూలూరుపాడు: ఆటో వర్కర్ల యూనియన్ (ఏఐటీయూసీ) నూతన కమిటీ ఎన్నిక శనివారం జూలూరుపాడులో జరిగింది. పాపకొల్లు ఆటో అడ్డా అధ్యక్షుడిగా నిమ్మటూరి లచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా కాతిరాజు శివకృష్ణ, కార్యదర్శిగా గార్లపాటి వీరభద్రం, కోశాధికారిగా మోదుగు డానియేలు ఎన్నికయ్యారు.

సూపర్‌వైజర్లకు శిక్షణ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఎంవీటీసీలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏరియా జీఎం వీసం కృష్ణయ్య శనివారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. 12 రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణి ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ (వోల్వో) ఇవ్వనున్నట్లు జీఎం వి.కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

బ్యానర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రత్యేకతలను తెలుపుతూ ప్రింటింగ్ చేయించిన బ్యానర్లను కొత్తగూడెం మండల విద్యాధికారి డాక్టర్ ఎమ్.ప్రభుదయాళ్ శనివారం ఎంఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఈ బ్యానర్లను కూడళ్లలో ప్రదర్శిస్తున్నామని, అందరికీ తెలిసి, పాఠశాలల పట్ల ఆకర్షితులవుతారన్నారు.

పర్మనెంట్ చేయాలి

ఇల్లెందు: గ్రామపంచాయతీలలో పనిచేసే కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని ఎన్డీ – ఇఫ్టూ అనుబంధ తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.దాసు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడగా.. సారంగపాణి, సామేల్, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయండి..

ఇల్లెందు: కళాశాలల విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. శనివారం పట్టణంలోని జగదాంబా సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వి.హరీష్‌గౌడ్, అనిల్ యాదవ్, రవి, రాకేష్, అన్వేష్ పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

జూలూరుపాడు: రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యూరియా కొరతను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



బుట్టలు, బ్యాగులతో స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు



డిజిటల్ పాఠం వింటున్న విద్యార్థులు



ఇంటి వద్ద రీడింగ్ కార్నర్

‘కార్పొరేట్’కు దీటుగా ప్రభుత్వ స్కూల్

పలక, బలపాలకు స్వస్తి

- ముత్తారపుకట్ట పాఠశాలలో డిజిటల్ తరగతులు
- వాచింగ్, లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ ఆధారంగా బోధన
- ఇంటి వద్ద రీడింగ్ కార్నర్, స్టడీ అవర్‌లు నిర్వహణ
- వాట్సాప్ గ్రూపు ద్వారా సమాచారం



పాఠశాలలో ఉదయం ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఇల్లెందు: ఇల్లెందు మండలం ముత్తారపుకట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అయినా ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. కార్పొరేట్ స్థాయిలో బోధిస్తున్నారు. సొంతగా ఏర్పాటు చేసుకున్న టీవీల ద్వారా డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పలకా, బలపాలు ఉండవు. టీవీలో బొమ్మలను చూసి అక్షరాలను కూర్చి చదువుకుంటున్నారు. అంతేకాదు ఆటాపాటలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా ఈ పాఠశాలలో విద్యార్థులకు వాచింగ్, లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ ఆధారంగా బోధన సాగుతోంది. ప్రతీరోజు వర్క్ బుక్, టెస్ట్ బుక్, నోట్ బుక్స్ రాయిస్తున్నారు. అంతేకాదు స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లిన ప్రతీ విద్యార్థి ఇంటి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ‘రీడింగ్ కార్నర్’లో స్కూల్‌లో చెప్పిన పాఠాలు చదువుకుంటారు. ఉదయం సా యంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహణ ఉంటుంది. దీనికోసం ముత్తారపుకట్ట పాఠశాల పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో తల్లిదండ్రులు విద్యార్థి బోర్డు ముందు నిలబడి చదివే ఫొటో షేర్ చేస్తుంటారు. పాఠశాలలో 1 – 5వ తరగతి వరకు 38 మంది విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, గ్రామానికి చెందిన ముఖ్యులు, దాతలతో కలిపి వాట్సాప్ గ్రూప్‌లో పాఠశాల విషయాలు, స్టడీ అవర్స్ నిర్వహణ ఫొటోలు ప్రతీరోజు పోస్టు చేసి ఆ వారంలో అందరి కంటే బాగా చదివిన విద్యార్థులను అభినందిస్తూ ఫొటోలను షేర్ చేసి ప్రోత్సాహిస్తున్నారు.

క్రమం తప్పని పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశం..
ప్రతీనెల పాఠశాలలోని సమస్యలతో పాటు విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల బోధనపై చర్చించేందుకు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల కమిటీ సమావేశం జరుగుతుంది. విద్యార్థులు, పాఠాలపై చర్చించి సలహాలు, సూచనలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ కార్యక్రమం సందర్భంగా సదుపాయాల కల్పనకు స్థానికులు ప్రతీనెల కొంత ఆర్థికసాయం అందిస్తున్నారు. అంతేకాకుండా రూ.6 వేల వేతనంతో ఓ వలంటీర్‌ను నియమించుకున్నారు. ఇక బీరువాలు, పుస్తకాలు ఇతర సామాన్ల కోసం ర్యాకులు సమకూర్చారు. వితరణతో సమకూరిన సౌండ్ బాక్స్ ద్వారా ప్రతిజ్ఞను ఆలపిస్తున్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం..
ఇక్కడ రెండేళ్లుగా ఏకలవ్య, మోడల్, గురుకులాల్లో చేరేందుకు నిర్వహించే పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఇలా పోటీ పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటుకుంటున్నారు. 2023–24లో ఐదుగురు, 2024–25లో ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించారు.

మండల స్థాయిలో అగ్రస్థానంలో..
రెండేళ్లుగా ముత్తారపు కట్ట పాఠశాల మండల స్థాయిలో, ఎఫ్ఎల్ఎం, కాంపెక్స్ స్థాయిలోనూ అగ్రస్థానంలో నిలిచింది. ఇటీవల విత్తనాల సేకరణలోనూ మండల స్థాయికి ఎంపికైంది.

ముత్తారపు కట్ట స్కూల్‌లో విద్యార్థులు ఇలా..
ముత్తారపుకట్ట పాఠశాలలో 1వ తరగతి లో 10మంది, 2లో ఏడుగురు, 3లో ఐదుగురు, 4లో ఎనిమిది మంది, 5వ తరగతి లో ఎనిమిది మంది ఉన్నారు. ఇద్దరు ఎస్ జీటీ టీచర్లు కబ్బాకుల రవి, ఆరెం రవికుమార్‌లతో పాటు వలంటీర్ కె.మౌని ప్రత్యూష, ఇద్దరు వంట వర్కర్లు ఉన్నారు. స్కూల్ ఆవరణలో అంగన్‌వాడీ సెంటర్, స్కూల్ భవనంలో గ్రామపంచాయతీ కొనసాగుతోంది.

ప్రతీ విద్యార్థికి ఒక బుట్ట, బ్యాగు..
విద్యార్థులకు స్కూల్ బ్యాగు, ఒక బుట్ట కూడా ఉంటుంది. ఆ బుట్టలో ప్లేట్, గ్లాసు, వాటర్ బాటిల్, చేతిరుమాలు, కూర్చునే పట్టా, గొడుగు మొదలగు వస్తువులు ఈ బుట్టలో పెట్టుకుని వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థికి స్కూల్ బ్యాగు, బుట్ట ఉన్నాయి.

సండే స్పెషల్

బొమ్మలు చూసి చదువుతాము..



ఇక్కడ టీవీ మీద వచ్చే బొమ్మలను చూస్తూ ఆ బొమ్మను గుర్తు పట్టి అక్షరాలరె చదవుతాము. ఆటపాటలతో పాటు సార్లు పాఠాలు చాలాబాగా చెడుతున్నారు. ప్రతీరోజు ఇంటి వద్ద కూడా చదువుతాము. చదివిన పాఠం ప్రతీరోజు మళ్లీ మళ్లీ వినటం, చెప్పటం, రాయటం చేస్తుంటాము. దీనివల్ల బాగా గుర్తుంటున్నాయి.

– కల్తీ సాగరిక, 5వ తరగతి

నాణ్యమైన భోజనం అందిస్తున్నాం..



ముత్తారపుకట్ట పాఠశాలలో ప్రతీరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందిస్తాము. ప్రతీ విద్యార్థి ఇక్కడే భోజనం చేస్తుంటారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవటం, లైన్‌గా రావటం, ఆహారం స్వీకరించటం, ఆ తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకుని ప్లేట్లు బుట్టలో భద్రపర్చుకుంటారు.

– బొర్ర యశోద, వంట మనిషి

మరింత అభివృద్ధి చేస్తాం..



ముత్తారపు కట్ట పాఠశాలను మరింత అభివృద్ధి చేసి కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా తీర్చిదిద్దుతాము. స్కూల్ ఆవరణ పరిశుభ్రంగా చేసేందుకు టైల్స్ పరిచేందుకు, శిథిల భవనాల మరమ్మతు చేసేందుకు అదనపు నిధులు అవసరం ఉన్నాయి. రంగులు, విద్యుత్, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్ సదుపాయాలు కల్పించాలి.

– కబ్బాకుల రవి, హెచ్ఎం, ముత్తారపుకట్ట

మానసిక ఒత్తిడికి పరిష్కారం.. ధ్యానం



మాట్లాడుతున్న మాధురి

పాల్వంచరూరల్: ధ్యానం చేయడం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఒత్తిడిని అధికమించవచ్చని శ్రీరామచంద్ర మిషన్ మాస్టర్ మాధురి సూచించారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరురోజుల ధ్యాన శిక్షణ ముగింపు శనివారం జరిగింది. శిక్షకురాలు మాట్లాడుతూ... ఇంటర్ విద్యలో విప్లవత్మకమైన మార్పులు తీసుకరావడానికి విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించే ప్రక్రియను వినూత్నంగా తెలంగాణ ఉన్నత విద్యా పర్యవేక్షణ అధికారులు, ఇంటర్ విద్యా డైరెక్టర్ శ్రీకృష్ణ ఆదిత్య నేతృత్వంలో స్టూడెంట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి హార్ట్ ఫుల్‌నెస్ యోగా ప్రోగ్రాంను ఆరు రోజులు ఉపాధ్యాయులు, విద్యార్థులకు నిర్వహించడం జరిగిందన్నారు. ధ్యాన శిక్షణ ఎంతో మేలు చేస్తుందని విద్యార్థులు అనుభవం ద్వారా వ్యక్తం చేసినట్లు తెలిపారు. శిక్షణ ముగింపు అనంతరం మాస్టర్ మాధురిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు గోపాలకృష్ణ, రవీంద్రబాబు, అనురాధ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఇల్లెందు: నేడు ఇల్లెందు పట్టణంలోని మెయిన్ రోడ్ హైస్కూల్ ఆవరణలో పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని కిమ్స్ హాస్పిటల్ వారిచే ఉదయం 9 – 1 గంట వరకు అన్ని రకముల ఉచిత వైద్య పరీక్షలు, ప్రముఖ వైద్యులచే వైద్యం అందించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు, చుట్టుపక్కల మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

23న అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూ

కొత్తగూడెంఅర్బన్: శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 23న వాణిజ్యశాస్త్రము 1, అర్థశాస్త్రం 1, రాజనీతి శాస్త్రం 1 అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు జరగనున్నాయని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం.. ప్రతీ సబ్జెక్ట్‌కు ఇంటర్వ్యూతో పాటు డెమో క్లాస్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

ఆదివాసీలను అడవికి దూరం చేయొద్దు..



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అడవికి దూరం చేయాలని చూస్తున్నాయని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు అన్నారు. శనివారం లక్ష్మీదేవిపల్లిలో జరిగిన తుడుందెబ్బ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట ఆదివాసీ ప్రాంతాల్లో విధ్వంసాలకు పూనుకున్నాయని ఆరోపించారు. ఆదివాసీల హక్కులను, జీఓలను ఉల్లంఘిస్తూ ఆ ప్రాంత గ్రామసభల తీర్మానాలు లేకుండానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన జీఓ 49 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దారబోయిన రమేష్, బండారు సూర్యనారాయణ, ఊకె రామకృష్ణ, తమ బల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద ఆందోళన



డీఏఓ బాబూరావుకు వినతిపత్రం అందజేస్తున్న హరిప్రియ, దిండిగల రాజేందర్, తదితరులు

ఇల్లెందు: కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవన్నట్లు.. ఎరువులు పంపిణీ చూస్తుంటే అదే గుర్తుకు వస్తోందని, రైతులకు సరిపడా ఎరువులు అందించలేని కాంగ్రెస్‌ను సమాధి చేయాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల రాజేందర్ అన్నారు. శనివారం ఇల్లెందు మార్కెట్ కార్యాలయం వద్ద సొసైటీ ద్వారా ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. అంతకు ముందు అక్కడికి వచ్చిన రైతులతో పంటల సాగు, ఎరువులు పంపిణీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇందిరమ్మ పాలన అంటే నాటి ఎమర్జెన్సీ గుర్తుకు వచ్చిందన్నారు. రోజుకో మంత్రి, రోజుకో అధికారి ఇచ్చే వివరణలు పొంతన లేకుండా ఉన్నాయన్నారు. రైతులకు కనీసం సరిపడా ఎరువులు ఇవ్వలేని పాలకులు గద్దె దిగిపోవాలన్నారు. అంతకు ముందు ఏడీఏ లాల్‌చంద్, డీఏఓ బాబూరావు, ఏఓ సతీష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం రమేష్, వరప్రసాద్, ఆంతోటి అచ్చయ్య, లక్ష్మణ్‌నాయక్, తాత గణేష్, రంగనాథ్, జేకే శ్రీనివాస్, రేణుక, సిలివేరు సత్యనారాయణ, ప్రమోద్, లాల్‌సింగ్, అబ్దుల్ నబీ, కటకం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): 136 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన సింగరేణిలో భూగర్భగనుల సంఖ్య రానురాను తగ్గుముఖం పడుతోంది, అదేవిధంగా కార్మికవాడలు వెలవెల పోతున్నాయి. ఈ నేపథ్యంలో నూతన ప్రాజెక్ట్ కోసం కృషి చేయాలని నూతన డైరెక్టర్(పా) గౌతంపోట్రును సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు కోరారు. శనివారం ఆయనను సింగరేణి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆంతోటి మాట్లాడుతూ.. పదేళ్లుగా సంస్థలో ఐఏఎస్ అధికారి లేక పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. వీటిని పరిష్కరించి సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సెంట్రల్ కమిటీ సభ్యులు బందెల విజేందర్ పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికలపై సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించే విధంగా ప్రతీ కార్యకర్త ముందుండి నడవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతీ ఇంటికి భారతీయ జనతా పార్టీ కరపత్రం వెళ్లే విధంగా చూడాలని చెప్పారు. జిల్లా సంస్థాగత ఎన్నికల కన్వీనర్ జీవీకే మనోహర్, జిల్లా మాజీ అధ్యక్షుడు కేవీ.రంగా కిరణ్, జంపన సీతా రామరాజు, జల్లారపు శ్రీనివాస్, శీలం విద్యాసాగర్, ఇర్ప రవికుమార్ పాల్గొన్నారు.

23న విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, ఫీజుల దోపిడీని అరికట్టాలనే ప్రధాన డిమాండ్లతో జూలై 23న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు (పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ (న్యూడెమోక్రసీ) నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకరావాలని, ఖాళీగా ఉన్న టీచర్ల, ఎంఈఓ, డీఈఓల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కంపాటి పృథ్వీ, అభిమన్యు, ప్రణయ్, అజిత్, జే.గణేష్, మహేష్, వినయ్, సంజయ్, భార్గవ్ పాల్గొన్నారు.

సాధు సంతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పాల్వంచ: ప్రభుత్వం సాధు సంతులను, పూజారులను ఆదుకోవాలని హాతీరాం సేన రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ రాములు నాయక్ అన్నారు. శనివారం కార్పొరేషన్‌లోని కరకవాగు వద్ద గల శ్రీ జగదాంబ తుల్జా భవానీ ఆలయంలో సాధులతో సమావేశం నిర్వహించారు. రాములు నాయక్ మాట్లాడుతూ... సాధులకు, పూజారులకు ధూప, దీప నైవేద్యం బాధ్యతలను అప్పగించాలన్నారు. అన్ని దేవాలయాల్లో సాధుసంతులకు వీఐపీ దర్శనం ఇప్పించాలని, ఆర్టీసీ, రైల్వే ప్రయాణాలు ఉచితం చేయాలని, రాష్ట్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయాలు ఉన్నచోట హాతీరాం బాబా దేవాలయాలు కట్టించాలన్నారు. గణేష్ మహారాజ్, కృష్ణ నాయక్, శంకర్, శరత్, సురేష్, చంద్రకళ, నిరోష పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుని ఐఐటీలో సీటు సాధించిన నలుగురు పూర్వ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం శనివారం ఘనంగా సన్మానించింది. గుగులోత్ రాంకుమార్, గుగులోత్ ప్రశాంత్, బానోత్ గౌతమ్, జర్పుల బలరాంలను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో చక్కని బోధన ద్వారా తమ భవిష్యత్‌కు చక్కటి పునాది వేశారని, ప్రయోగాత్మక విద్యాబోధన ఎంతగానో ప్రయోజనం చేకూర్చిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాభిషేక వేడుక



విద్యార్థి మండలి సభ్యులతో ఉపాధ్యాయులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం 2025–2026 విద్యా సంవత్సరానికి విద్యార్థి మండలి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి మండలి సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సౌమ్య, ప్రిన్సిపాల్ ఆర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్ జోన్‌లో మహిళా సంఘాల ఉత్పత్తులు



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

ఇల్లెందు: ప్రభుత్వం అందజేసిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వశక్తితో ఆర్థికంగా బలోపేతం కావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. శనివారం పట్టణంలోని మెయిన్‌రోడ్ హైస్కూల్ ఎదురుగా స్ట్రీట్ వెండర్ జోన్ వద్ద మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. పట్టణంలోని 24 వార్డుల నుంచి తరలివచ్చిన వివిధ రకాల వస్తువులు, ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ బుట్టలు, క్లాత్ స్టోర్, అంబలి లాంటి పలు ఆహార పదార్థాలు ప్రదర్శనలో పెట్టారు. ఈ సందర్భంగా మహిళలను కమిషనర్ శ్రీకాంత్ అభినందించారు. కమిషనర్‌తో పాటు మేనేజర్ అంకుషావలీ, మెప్మా పట్టణ కోఆర్డినేటర్ నాగయ్య, నాసర్, నాగమణి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహిళా సంఘాలచే తయారు చేసిన ఉత్పత్తులు ప్రదర్శన సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగల రాజేందర్ తదితరులు తమ కార్యకర్తలతో తరలివచ్చి, అక్కడి వస్తువులను స్వయంగా కొనుగోలు చేసి మహిళా సంఘాల సభ్యులను అభినందించారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి..
పాల్వంచ: మహిళా సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మున్సిపల్ డివిజన్ మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ రమేష్ అన్నారు. శనివారం స్థానిక డివిజన్ పరిధిలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేనేజర్ సత్యనారాయణ ప్రారంభించారు. మాట్లాడుతూ... ఫుడ్ ఫెస్టివల్ ద్వారా పలు ఉత్పత్తులను విక్రయించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఏడీఎంసీ చంద్రశేఖర్‌బాబు, డివిజన్ ఇన్‌చార్జ్ వై.ఉపేందర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు డి.బుజ్జి, బి.సుగుణలక్ష్మి, లలిత, టీఎల్ఎఫ్ఆర్ పి.సునీత పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోనాల సంబురాలు



కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా ప్లే స్కూల్‌లో..



పాల్వంచ: త్రివేణి పాఠశాలలో..



బాలికోన్నత పాఠశాలలో..

శ్రీ రాగా ప్లే స్కూల్‌లో...
కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మేదరబస్తీలోని శ్రీ రాగా ప్లే స్కూల్‌లో బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. మేనేజ్‌మెంట్ మల్లారపు వరప్రసాద్, కవిత అమ్మవారికి బోనాలు సమర్పించి, పూజ నిర్వహించారు. చిన్నారులు బోనాలు ఎత్తుకొని పాఠశాల ఆవరణలో ప్రదర్శన చేసి పండుగ వాతావరణాన్ని తలపించారు.

త్రివేణి పాఠశాలలో... లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో శనివారం బోనాల జాతర ఘనంగా జరిగింది. పాఠశాలలోని విద్యార్థులు పోతురాజు, శివసత్తుల సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో అమ్మవారికి పూజలు చేశారు. డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, జగదీష్, సీఆర్‌జో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం బోనాల పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలను తోరణాలు, పూలమాలలు, రంగవల్లులతో అలంకరించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు బోనమెత్తారు. పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. త్రివేణి పాఠశాలలో అమ్మవార్లు, పోతురాజు వేషధారణలతో విద్యార్థులు అలరించారు. బోనాల విశిష్టతను వివరించారు. ప్రిన్సిపాల్ రామ్మూర్తి, కవిత పాల్గొన్నారు.